సాక్షి
కామారెడ్డి

సోమవారం । 11 । మార్చి । 2024





## ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్ చోరీ

బోర్లం శివారులోని వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లనుంచి దొంగలు విలువైన ఆయిల్, కాపర్ కాయిల్స్ దొంగిలించారు.

- 8లో ▸



## బస్తీమే సవాల్

మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా జిల్లాలోని పలు ప్రాంతాలలో ఆదివారం నిర్వహించిన కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగాయి.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
37.4 /18.4

## వాతావరణం

ఉదయంనుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత కొనసాగవచ్చు.

## న్యూస్‌రీల్

### రాష్ట్రస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు ఎంపిక



బాన్సువాడ : నిజామబాద్‌లో ఆదివారం నిర్వహించిన సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో బాన్సువాడకు చెందిన సఫాన ఫాతిమా ఫస్ట్ ర్యాంక్ సాధించింది. నగరంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నేను సైతం ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌లో బాన్సువాడ ఇండియన్ మోడల్ స్కూల్ ఏడో తరగతి విద్యార్థి ఫాతిమా ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. విద్యార్థినిని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

### మంకీగన్‌లకు భలే డిమాండ్



నాగిరెడ్డిపేట : గ్రామాల్లో కోతుల బెడద ఎక్కువైపోయింది. గుంపులుగా వచ్చే కోతులను తరిమేందుకు ప్రజలు పలుమార్గాలను అనుసరిస్తున్నారు. పలువురు మంకీగన్‌లతో వానరాలను తరుముతున్నారు. ఈ క్రమంలో ఆదివారం నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేటకు ఓ వ్యక్తి మంకీగన్‌లు అమ్మేందుకు తీసుకురాగా స్థానికులు కొనుగోలు చేశారు. మహారాష్ట్రకు చెందిన ఓ వ్యక్తి పైపులతో ప్రత్యేకంగా తయారుచేసిన మంకీగన్‌లను విక్రయానికి తీసుకువచ్చాడు. ఒక్కో దానిని రూ.200చొప్పున విక్రయించాడు.

### 'హింసకు వ్యతిరేకంగా ఉద్యమించాలి'



కామారెడ్డి టౌన్: దేశవ్యాప్తంగా మహిళలు, బాలికలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా సంఘటితంగా ఉద్యమించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) ప్రతినిధులు పిలుపునిచ్చారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లా కేంద్రంలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో చర్చాగోష్ఠి నిర్వహించారు. మహిళల రక్షణ కోసం కఠిన చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ మహిళా ప్రతినిధులు నళిని దేవి, లక్ష్మి, విజయ శ్రీ, శ్రీవాణి, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ నాగభూషణం, ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కె.వేణుగోపాల్, సీనియర్ నాయకులు హన్మండ్లు, కె.రమణ, జగన్నాథం, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీ జిల్లా కార్యవర్గం ఏర్పాటు

కామారెడ్డి టౌన్: బీజేపీ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆ పార్టీ అధ్యక్షురాలు అరుణతార ఆదివారం ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా సతీశ్ జోషి, పి.లక్ష్మీనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శులుగా రవీందర్‌రావు, బండారి నరేందర్‌రెడ్డి, కార్యదర్శులుగా సరోజ, శంకర్‌గౌడ్, అరుణ్‌పటేల్, వడ్ల నర్సింహాచారి, జిల్లా కార్యాలయ కార్యదర్శిగా అన్మండ్ల సురేశ్ నియమితులయ్యారు. భారతీయ యువమోర్చా జిల్లా అధ్యక్షుడిగా నంది వేణు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలిగా విశ్వనాథుల అనిత, కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా లక్ష్మారెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా తోట బాలరాజు, మైనారిటీ మోర్చా అధ్యక్షుడిగా నేహల్, జిల్లా స్పోక్స్ పర్సన్లుగా అవధూత నరేందర్, హన్మండ్లులను నియమించినట్లు బీజేపీ అధ్యక్షురాలు ఒక ప్రకటనలో తెలిపారు.

**మండలాల అధ్యక్షులు..**

కామారెడ్డి పట్టణ అధ్యక్షుడిగా అకుల భరత్, కామారెడ్డి రూరల్ మండల అధ్యక్షుడిగా చందన శ్రీధర్, మాచారెడ్డి మండలాధ్యక్షుడిగా బుర్ర సురేశ్, పల్వంచ మండలాధ్యక్షుడిగా అనిల్ , బీబీపేట్ మండలాధ్యక్షుడిగా రంజిత్‌గౌడ్, దోమకొండ మండలాధ్యక్షుడిగా భూపాల్‌రెడ్డి, భిక్కనూరు మండలాధ్యక్షుడిగా రమేశ్, రాజంపేట మండలాధ్యక్షుడిగా పిట్ల శ్రీనివాస్ నియమితులయ్యారు.

తాడ్వాయి మండలాధ్యక్షుడిగా సంతోష్‌రెడ్డి, లింగంపేట మండలాధ్యక్షుడిగా శ్రీనివాస్, ఎల్లారెడ్డి రూరల్ మండలాధ్యక్షుడిగా నర్సింలు, నాగిరెడ్డిపేట మండలాధ్యక్షుడిగా శ్రీకాంత్, గాంధారి మండలాధ్యక్షుడిగా మధుసూదన్‌రావు, సదాశివనగర్ మండలాధ్యక్షుడిగా రామ్‌రెడ్డి, రామారెడ్డి మండలాధ్యక్షుడిగా ఈశ్వర్‌లను నియమించారు.

# ఓటమితో కుంగిపోవద్దు

- కసితో పనిచేసి పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుదాం
- ప్రభుత్వంపై ఇప్పటికే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది
- వంద రోజులు దాటాక రంగంలోకి దిగుదాం
- పార్టీ శ్రేణులతో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సభలో మాట్లాడుతున్న కేటీఆర్, వేదికపై మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గంప, జాజాల

సాక్షి, కామారెడ్డి : ''మొన్నటి ఎన్నికల్లో ఓటమి చేదు అనుభవం. జరిగిందేదో జరిగిపోయింది. ఓటమితో కుంగిపోవద్దు. భవిష్యత్తు కోసం కలిసికట్టుగా కసితో పనిచేసి విజయాలు సొంతం చేసుకుందాం'' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని సత్య కన్వెన్షన్‌లో పార్టీ కామారెడ్డి నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలవికాని హామీలు, అబద్ధపు ప్రచారాలు, మాయ మాటలతో మోసపోయామని తక్కువ సమయంలోనే ప్రజలు అర్థం చేసుకున్నారన్నారు. కేసీఆర్ గెలుపు కోసం అందరూ కష్టపడ్డారని, అయితే తప్పుడు ప్రచారాలతో నష్టం జరిగిందని పేర్కొన్నారు. కేసీఆర్ భూములు గుంజుకుంటడంటూ చేసిన తప్పుడు ప్రచారాన్ని మనం సరిగా తిప్పికొట్టలేకపోయామన్నారు. కేసీఆర్ గెలిస్తే కామారెడ్డిని వదిలి గజ్వేల్‌కు పోతాడంటూ జరిగిన ప్రచారంతోనూ నష్టం జరిగిందన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో బాన్సువాడ, బాల్కొండలలో గెలిచామని, జుక్కల్, కామారెడ్డి, బోధన్‌లలో స్వల్ప తేడాతో ఓడిపోయామని పేర్కొన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీచేసే అభ్యర్థికి భారీ మెజారిటీ ఇవ్వడానికి కార్యకర్తలంతా కలిసి పనిచేయాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గంప గోవర్ధన్ నాయకత్వంలో పనిచేసినట్టే, ఎంపీ ఎన్నికల్లోనూ ఆయన నాయకత్వంలో అందరూ కలిసి పనిచేయాలని కేటీఆర్ కోరారు.



సభలో పాల్గొన్న కార్యకర్తలు

**ఈనెల 15 నాటికి వంద రోజులు..**

ఎన్నికలలో గెలవడానికి కాంగ్రెస్ 420 హామీలు ఇచ్చిందని, వాటిని అమలు చేయకుంటే ఊరుకునేది లేదని కేటీఆర్ పేర్కొన్నారు. రూ. 2 లక్షల రుణ మాఫీ చేస్తామని, రైతుబంధు, పింఛన్ పెంచుతామని, మహిళలకు రూ.2,500 ఇస్తామని హామీలు ఇచ్చారని, ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. రేవంత్‌రెడ్డి పాలనకు మార్చి 15 నాటికి వంద రోజులు నిండుతాయని పేర్కొన్నారు. వంద రోజుల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజలతో కలిసి పోరాటాలు చేద్దామన్నారు. సిరిసిల్లలో రాజీనామా చేసి మల్కాజ్‌గిరిలో పోటీ చేయడానికి తాను సిద్ధమని, రేవంత్‌రెడ్డి కొడంగల్‌లో రాజీనామా చేసి, సీఎం సీటును వదులుకుని రావాలని సవాల్ చేస్తే సమాధానం లేదని విమర్శించారు.

### కేటీఆర్ ముందే బయటపడ్డ విభేదాలు..

కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో నేతల మధ్య విభేదాలు బయటపడ్డాయి. పార్టీ సీనియర్ నాయకుడు తిర్మల్‌రెడ్డి తన ప్రసంగంలో గంప గోవర్ధన్ పేరును ప్రస్తావించకపోవడంతో మొదలైన గలాట కొంతసేపు ఉద్రిక్తతకు దారి తీసింది. అలాగే సీడీసీ మాజీ చైర్మన్ నర్సయ్య వేదికపైన అడ్డుగా ఉన్నారంటూ పక్కకు జరిపిన సందర్భంలోనూ గొడవ చెలరేగింది. కాగా సమావేశానికి ముందు ఓ ఫామ్‌హౌజ్‌లో పార్టీ ముఖ్యనేతలతో కేటీఆర్ సమావేశమై విభేదాలను పక్కనపెట్టి కలిసి పనిచేయాలని సూచించారు.

### కేటీఆర్ సవాల్‌ను స్వీకరించాలి



పార్లమెంటు ఎన్నికల్లో గెలుపు ఓటముల మీద రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలపై కేటీఆర్ స్పందించి మల్కాజ్‌గిరిలో పోటీకి రావాలని సవాల్ చేశారని, దీనిపై సీఎం ఇప్పటికీ స్పందించలేదని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డికి దమ్ముంటే కేటీఆర్ సవాల్‌ను స్వీకరించాలని డిమాండ్ చేశారు. ఇటీవల తన గురువు చంద్రబాబుతో రేవంత్‌రెడ్డి కలిసి బీజేపీతో దోస్తానా గురించి చర్చించాడని వార్తలు వచ్చాయని, ప్రజలందరూ రేవంత్ రెడ్డి వ్యవహారాన్ని గమనిస్తున్నారని పేర్కొన్నారు. కార్యకర్తలెవరూ అధైర్యపడవద్దని, తనతోపాటు కేటీఆర్, గంప గోవర్ధన్ అండగా ఉంటారని ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు.

### తప్పుడు ప్రచారంతోనే ఓడిపోయాం

కాంగ్రెస్, బీజేపీ నేతలు చేసిన తప్పుడు ప్రచారం వల్లే కామారెడ్డిలో ఓడిపోయామని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పేర్కొన్నారు. ఈ ఓటమికి క్షమాపణ కోరుతున్నానన్నారు. వెంకటరమణారెడ్డి ఎన్నికల్లో డబ్బులు పంచలేదని డప్పాలు కొడుతున్నాడని, గుడులు, సంఘాలకు కోట్లకు కోట్లు పంచింది నిజం కాదా అని ప్రశ్నించారు. కామారెడ్డి, నిజామాబాద్‌లలో వరుసగా ఓడిపోయిన షబ్బీర్ అలీ.. సీఎం రేవంత్‌రెడ్డి కాళ్లు మొక్కి ప్రభుత్వ సలహాదారు పదవి తెచ్చుకుని, నియోజకవర్గంలో పెత్తనం చేస్తున్నాడని విమర్శించారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టిస్తున్నాడని ఆరోపించారు. కార్యకర్తలకు అండగా నిలబడతానని, ఎవరూ అధైర్యపడొద్దని పేర్కొన్నారు. ఎంపీ ఎన్నికలలో సత్తా చాటుదామన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, రాష్ట్ర నాయకుడు తిర్మల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జాహ్నవి, జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్ తదితరులు ప్రసంగించారు. సభలో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, నాయకులు ఎంజీ వేణుగోపాల్‌గౌడ్, నర్సింగరావు, నల్లవెల్లి అశోక్, మామిండ్ల అంజయ్య, సుమిత్రానంద్, పిప్పిరి ఆంజనేయులు, వెంకటి, శారద, బాలమణి, రాంరెడ్డి, లక్ష్మారెడ్డి, ఇంద్రసేనా రెడ్డి, గంప శశాంక్, భానుప్రసాద్, ప్రభాకర్‌రెడ్డి, రమేశ్ గుప్తా, మాజిద్, రంజిత్, శేఖర్, అనిల్‌రెడ్డి, వేదశ్రీ తదితరులు పాల్గొన్నారు.



## జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిత్వంపై చర్చ



జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని పార్టీ నేతలతో చర్చిస్తున్న కేసీఆర్

సాక్షి, కామారెడ్డి: జహీరాబాద్ పార్లమెంట్ స్థానంలో అభ్యర్థి ఎంపికపై బీఆర్‌ఎస్ కసరత్తు చేస్తోంది. ఆదివారం మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జీలు, ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. అభ్యర్థిత్వం విషయంలో నాయకులతో చర్చించారు. రెండు రోజుల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిని ప్రకటించే అవకాశాలున్నాయి. సమావేశంలో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, జాజాల సురేందర్, హన్మంత్ సింధే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌ను వీడనున్న నిట్టు కుటుంబం

సాక్షి, కామారెడ్డి: బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు నిట్టు వేణుగోపాల్ రావ్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు పార్టీని వీడనున్నట్టు సమాచారం. వేణుగోపాల్ రావ్ కూతురు జాహ్నవి కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా, ఆయన సోదరుడు కృష్ణ మోహన్ కౌన్సిలర్‌గా ఉన్నారు. పట్టణంలో ఆయనకు బలమైన అనుచర వర్గం ఉంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు నుంచి నిట్టు వేణుగోపాల్ రావ్ అసంతృప్తితో ఉన్నారు. ఆదివారం జరిగిన పార్టీ సమావేశానికి సైతం ఆయన హాజరు కాలేదు. దీంతో ఆయన పార్టీని వీడతారన్న ప్రచారం ఊపందుకొంది. పార్లమెంట్ ఎన్నికల వేళ చైర్మన్‌తో పాటు కౌన్సిలర్లు పార్టీని వీడితే దాని ప్రభావం ఎన్నికలపై ఉంటుందని బీఆర్‌ఎస్ నేతలు భావిస్తున్నారు.

## విధుల్లో చేర్చుకోండి సారూ!

- రెవెన్యూ నుంచి రిలీవ్ అయిన 25 మంది వీఆర్‌ఏలు
- కామారెడ్డి మున్సిపాలిటీలో జాయిన్ కావాలని కలెక్టర్ ఉత్తర్వులు
- బల్దియాలో చేర్చుకోని అధికారులు



రెవెన్యూ నుంచి రిలీవై బల్దియాకు వచ్చిన వీఆర్‌ఏలు

కామారెడ్డి టౌన్ : ప్రభుత్వం వీఆర్‌ఏ వ్యవస్థను రద్దు చేసి వారిని ఆయా ప్రభుత్వ శాఖల్లో సర్దుబాటు చేసింది. ఈ క్రమంలో జిల్లాలోని మూడు మున్సిపాలిటీల్లో జాయిన్ కావాలని 65 మందికి కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆర్డర్ కాపీలను అందజేశారు. అయితే ఎల్లారెడ్డి, బాన్సువాడలకు కేటాయించిన వారు ఏడు నెలల క్రితమే విధుల్లో చేరి వేతనాలు పొందుతున్నారు. కానీ కామారెడ్డిలో మాత్రం ఇందుకు విరుద్ధంగా సాగుతోంది. కేటాయించిన వారిని విధుల్లో చేర్చుకోవడానికి మున్సిపల్ అధికారులు ఆసక్తి చూపడం లేదు.

**ఏడు నెలలుగా వేతనాలు రాక..**

ఉమ్మడి జిల్లాకు చెందిన 25 మంది వీఆర్‌ఏలను కామారెడ్డి బల్దియాలోని పబ్లిక్ హెల్త్ విభాగంలో జాయిన్ కావాలని గత ఆగస్టులో కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే వీరిలో ఒక్కరిని కూడా ఇప్పటి వరకు జాయిన్ చేసుకోలేదు. అప్పటి నుంచి ఇప్పటి వరకు వీరంతా ఆఫీస్‌కు వస్తున్నారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆవరణలోని పార్కులో సాయంత్రం వరకు కూర్చుని మళ్లీ గ్రామాలకు వెళ్తున్నారు. ఏడు నెలలుగా జీతాలు లేక కుటుంబ పోషణ భారంగా మారిందని, అప్పులతో నెట్టుకొస్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని కలిసి వేడుకున్నారు. తమను జాయిన్ చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్‌తో పాటు, కమిషనర్‌ను నిత్యం వేడుకుంటున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ సుజాతను 'సాక్షి' వివరణ కోరగా మున్సిపల్‌లో క్యాడర్ స్ట్రెంత్ పోస్టులు ఖాళీలుగా లేవని, పబ్లిక్ హెల్త్ విభాగంలో ఎక్కువగానే ఉద్యోగులు, కార్మికులు ఉన్నారని చెప్పారు. అందుకోసమే వారిని తీసుకోవడం లేదని సమాధానం ఇచ్చారు.

**జీతాలు లేక ఇబ్బందులు**



వీఆర్‌ఏలుగా పని చేసినప్పుడు వచ్చిన జీతాలతో మంచిగానే బతికినం. అక్కడి నుంచి తీసేసి మున్సిపల్‌లో వేశారు. ఇక్కడ పట్టించుకోవడం లేదు. రోజు వచ్చి ఇక్కడే పొద్దంతా కూర్చుని వెళ్తున్నాం. జీతాలు రాకపోవడంతో అప్పుల పాలవుతున్నాం.

– సుతారి నర్సింలు, కస్కల్, తాడ్వాయి

**ఏడు నెలలుగా తిరుగుతున్నాం**



ఏడు నెలల క్రితం మమ్మల్ని రెవెన్యూ శాఖ నుంచి తొలగించి కామారెడ్డి మున్సిపల్‌లో జాయిన్ కావాలని కలెక్టర్ ఆర్డర్ కాపీలను ఇచ్చారు. అప్పటి నుంచి రోజు చెప్పులు అరిగెలా తిరుగుతున్నా ఇక్కడ జాయిన్ చేసుకోవడం లేరు. మాకు న్యాయం చేయాలి.

– హైమద్, జుక్కల్

## సమాజ పరివర్తనే ఆర్‌ఎస్‌ఎస్ ధ్యేయం

- తెలంగాణ ప్రాంత సహ బౌద్ధిక ప్రముఖ్ నర్రా వెంకట శివకుమార్



సూర్యనమస్కారాలు సాధన చేస్తున్న స్వయం సేవక్‌లు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న శివకుమార్

సుభాష్‌నగర్: సమాజం, వ్యక్తి పరివర్తన కోసం ఆర్‌ఎస్‌ఎస్ పని చేస్తోందని, అందులో అందరినీ భాగస్వాములను చేసి మన మాతృభూమి వైభవానికి కృషి చేద్దామని ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ ప్రాంత సహ బౌద్ధిక్ ప్రముఖ్ శివకుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో శాఖా సంగమం నిర్వహించారు. నగరంలోని 36 బస్తీలకు చెందిన సుమారు వెయ్యి మందిపైగా స్వయం సేవకులు శాఖా సంగమంలో పాల్గొన్నారు. స్వయంసేవకుల దండ విన్యాసాలు, పథ సంచలనం, యోగాసనాలు, ఆటలు ఆకట్టుకున్నాయి. అనంతరం నర్రా వెంకట శివకుమార్ మాట్లాడుతూ సంఘం దేశంలో ఒక తపస్సు కొనసాగిస్తోందని, సమాజ మార్పునకు సంఘటిత మార్గం తప్ప మరో మార్గంలేదన్నారు. వ్యక్తి పరివర్తన కోసం నిత్య శాఖ, వ్యవస్థ పరివర్తన కోసం వివిధ క్షేత్రాలు, విద్యార్థి దశలో ఏబీవీపీ, కార్మిక రంగంలో బీఎంఎస్, కర్షక రంగంలో బీకేఎస్.. ఇలా 40కిపైగా వివిధ రంగాల్లో ఆర్‌ఎస్‌ఎస్ పని చేస్తోందని తెలిపారు. శ్రేష్ఠ సమాజ నిర్మాణానికి 99 ఏళ్ల తపస్సు ఈ శాఖ అని, ఆర్‌ఎస్‌ఎస్‌లో భాగస్వాములను చేసి మాతృభూమి వైభవానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. జాతీయతా భావాలు పెంపొందించడంలో, కలియుగంలో ధర్మాన్ని రక్షించే ధర్మ రక్షకులను తయారు చేయడంలో ఆర్‌ఎస్‌ఎస్ కీలక పాత్ర పోషిస్తోందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. చిన్ననాటి నుంచే పిల్లల్లో దేశభక్తి, జాతీయతా భావాలు పెంపొందించాలంటే తల్లిదండ్రులు తప్పకుండా తమ పిల్లలను సంఘ శాఖకు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ నగర సంఘచాలక్ తిరుక్కోవల్లూరు శ్రీనివాస్, నగర కార్యవాహ అర్గుల సత్యం, విభాగ్ కార్యవాహ దిగంబర్, కార్పొరేటర్లు పంచరెడ్డి ప్రవళిక శ్రీధర్, ఇల్లెందుల మమత ప్రభాకర్, నాయకులు శివనూరి భాస్కర్, హరీశ్‌రెడ్డి, చింతకాయల రాజేందర్, పుట్ట వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## 'రాజంపేటకు పూర్వ వైభవం తీసుకురావాలి'

రాజంపేట : రాజంపేటలోని చారిత్రక కట్టడాల పునరుద్ధరణకు గ్రామస్తులందరూ కలసికట్టుగా ముందుకు రావాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. ఆదివారం రాజంపేట మెట్ల బావి (గడీల బావి) పునరుద్ధరణలో భాగంగా చేపట్టిన శ్రమదానం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజంపేట గ్రామానికి ఎంతో చరిత్ర ఉందన్నారు. గ్రామానికి పునర్వైభవం తీసుకురావడానికి సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశం, ఎమ్మార్వో అనిల్ కుమార్, పంచాయతీ కార్యదర్శి అశోక్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో వినోద్, ఐకేపీ ఏపీఎం సాయిలు తదితరులు పాల్గొన్నారు.

**ఫిష్‌పాండ్ యూనిట్ సందర్శన**

రాజంపేట: మండల కేంద్రంలో పిట్ల పద్మ ఏర్పాటు చేసిన ఫిష్ పాండ్‌ను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు లాభాలనిచ్చే పంటలసాగుపై దృష్టి సారించాలన్నారు. చేపల పెంపకంతో ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. చేపల మార్కెటింగ్ కోసం ప్రణాళికలు రూపొందించాలని ఐకేపీ ఏపీఎం సాయిలు, సీసీ శ్రీనివాస్‌లను ఆదేశించారు.



శ్రమదానం చేస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

## క్లుప్తంగా

### విద్యార్థినికి ఆపన్నహస్తం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని అయ్యపల్లితండాకు చెందిన మునావత్ స్వర్ణ గిరిజన వైద్య విద్యార్థిని నల్గొండలో ఎంబీబీఎస్ నాలుగవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి బాగాలేనందున హెల్పింగ్ బ్రిడ్జి ఫర్ ఎడ్యుకేషన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఆదివారం రూ. 21 వేలు ఆర్థికసాయం చేశారు. సంస్థ ప్రతినిధులు గాండ్ల నర్సింలు, గుండ బాలకిషన్, సాయాగౌడ్, అరవింద్, పర్వయ్య, కృష్ణాకర్‌రావు తదితరులున్నారు.

### 13న జంగంపల్లిలో భూ సాధన సభ



భిక్కనూరు : మండలంలోని జంగంపల్లిలో ఈనెల 13వ తేదీ బుధవారం భూసాధన సభను నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి కొత్త నర్సింలు తెలిపారు. ఆదివారం మాట్లాడుతూ భూమి లేని నిరుపేదలకు ప్రభుత్వం వెంటనే భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సాధన సభకు వ్యవసాయ కార్మికసంఘం జాతీయ ప్రధాన కార్యదర్శిగా బి వెంకట్, రాష్ట్ర కార్యదర్శి వెంకట్‌రాములు, సహాయ కార్యదర్శి పద్మ నేతలు వెంకట్‌గౌడ్, చంద్రశేఖర్ హాజరవుతున్నార న్నారు.

### కాంగ్రెస్‌లో చేరిన వార్డు కౌన్సిలర్



కామారెడ్డి టౌన్ : బీఆర్‌ఎస్ పార్టీని ఆదివారం మరో మహిళా కౌన్సిలర్ వీడారు. 22వ వార్డు కౌన్సిలర్ జహీరా బేగం బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియా ఆమెకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు గడ్డం చందు, ఉర్దొండ రవి, తేజపు ప్రసాద్, రవీందర్‌గౌడ్, చాట్ల వంశీ, జమీల్, ఇమ్రాన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### కార్మికులందరూ రెన్యూవల్ చేసుకోవాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : ప్రతి కార్మికుడు లేబర్ ఇన్సూరెన్స్ కార్డ్ రెన్యూవల్ చేసుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు గొర్రె రాములు తెలిపారు. మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మిక సంఘ సమావేశంలో ఆదివారం కార్మికులు లేబర్ ఇన్సూరెన్స్ చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు గొర్రె రాములు మాట్లాడుతూ ప్రతి కార్మికుడు తప్పకుండా లేబర్ కార్డు,శ్రమ కార్డు తీసుకోవాలని లేబర్ కార్డు ద్వారా వచ్చే సంక్షేమ పథకాలు,ఇన్సూరెన్స్ ద్వారా వచ్చే సోమ్మును వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి, హన్మాండ్లు, మీసేవ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇరుకు గదుల్లో ఇరిగేషన్ కార్యాలయం

- సొంత భవనం లేక ఇబ్బందులు
- నిధులు మంజూరై రద్దయిన వైనం

బాల్కొండ: ఇరిగేషన్ కార్యాలయానికి సొంత భవనం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సాగునీటిలో ఎలాంటి ఇబ్బందులు కలుగవద్దని నియోజకవర్గంలో మైనర్ ఇరిగేషన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం 2021లో నిర్ణయించింది. కానీ కార్యాలయాలకు పక్కా భవనాలను నిర్మించడం మరిచింది. దీంతో నాటి నుంచి అద్దె భవనాలు, ప్రభుత్వ, ఇతర కార్యాలయ భవనాల్లో వీటి నిర్వహణ కొనసాగుతోంది. దీంతో ఇరిగేషన్ కార్యాలయానికి పక్కా భవనం లేక అధికారులు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాల్కొండ మండల కేంద్రంలో మైనర్ ఇరిగేషన్ డివిజన్-4 కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో ఒక ఈఈ, ఇద్దరు డిప్యూటీ ఈఈలు, ఎనిమిది మంది ఏఈఈలు, సిబ్బంది ఇక్కడ పని చేస్తున్నారు. కానీ కార్యాలయానికి ఇప్పటి వరకు పక్కా భవనం లేదు. దీంతో తహసీల్ కార్యాలయ సన్నిహిత భవనంలో గత మూడేళ్లుగా కొనసాగుతోంది. పక్కా భవనం కావాలని కొంత కాలంగా అధికారులు ప్రభుత్వానికి విన్నవిస్తున్నా మోక్షం లభించడం లేదు.





సన్నిహితలో కొనసాగుతున్న ఇరిగేషన్ కార్యాలయం

**ఇబ్బందుల్లో అధికారులు**

ఇరిగేషన్ డివిజన్ కార్యాలయం నిర్వహిస్తున్న సన్నిహిత భవనం ఇరుకుగా ఉంది. దీంతో అధికారులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫైళ్లు ఎక్కడ భద్ర పర్చాలో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో 10 రోజుల క్రితం సమీపంలో ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంగా గతంలో నిర్వహించిన గదిని కూడా తీసుకున్నారు. కానీ అది సరిపోవడం లేదు. కార్యాలయానికి కావాల్సిన ఫర్నిచర్‌ను ప్రభుత్వం మంజూరు చేసి పంపింది. ప్రస్తుతం ఆ సామగ్రి కూడ అందులోనే భద్రపరచాల్సి వస్తోంది. దీంతో మరింత ఇరుకుగా మారింది.

**గతంలో రూ. 10 లక్షలు మంజూరు..**

మండల కేంద్రంలో 2014లో ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయ నిర్మాణానికి ప్రభుత్వం రూ. 10 లక్షలు మంజూరు చేసింది. కార్యాలయ భవన నిర్మాణ పనులు పిల్లర్లు, బేస్‌మెంట్ స్థాయి వరకు కొనసాగాయి. కాంట్రాక్టర్ మృతి చెందడంతో పనులు అటకెక్కాయి. నాటి నుంచి నేటి వరకు పనులు మాత్రం జరగడం లేదు. దీనికి సంబంధించిన నిధులు సైతం రద్దు అయినట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

**ఉన్నతాధికారులకు నివేదించాం**

బాల్కొండ మండల కేంద్రంలో ఇరిగేషన్ కార్యాలయ భవనం నిర్మించాలని ఉన్నత అధికారులకు నివేదించాం. ప్రస్తుతం ఉంటున్న భవనంలో ఇరుకుగా ఉంది. సామాగ్రి ఎక్కడ పెట్టాలో తెలియడం లేదు.

– సురేశ్, డిప్యూటీఈఈ, బాల్కొండ

# గల్లంతైన ముగ్గురి మృతదేహాలు లభ్యం



నారాయణ, విష్ణువర్ధన్ మృతదేహాలు

వర్ని: నిజాంసాగర్ ప్రధాన కాలువలో గల్లంతైన ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మండలంలోని అఫంది ఫారంనకు చెందిన ఇద్దరు, చందూరుకు చెందిన ఒకరు శనివారం నిజాంసాగర్ ప్రధాన కాలువలో గల్లంతైన విషయం తెలిసిందే వీరిలో ముగ్గురి మృతదేహాలను ఆదివారం పోలీసులు గుర్తించారు. అఫంది ఫారానికి చెందిన మోచి విజయ్(50), నారాయణ(20), చందూర్‌కు చెందిన విష్ణువర్ధన్(25) మృతదేహాలను కనుగొన్నట్లు వర్ని ఎస్సై కృష్ణ కుమార్ తెలిపారు. చందూర్ శివారులో సాగర్ ప్రధాన కాలువలో విజయ్, విష్ణువర్ధన్ మృతదేహాలను, 38వ డిస్ట్రిబ్యూటరీలో నారాయణ మృతదేహాన్ని కనుగొన్నట్లు చెప్పారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. అఫంది ఫారం, చందూర్ గ్రామాలకు చెందిన ప్రజలతో పాటు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యల్లో పాల్గొన్నారు.



విషాదవదనంలో మృతుల కుటుంబ సభ్యులు

**రెండు గ్రామాల్లో విషాదఛాయలు**

సాగర్ కాల్వలో పడి గల్లంతైన వారు మృత్యువాత పడడంతో రెండు గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబీకులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

# భారీగా పీడీఎస్ బియ్యం పట్టివేత

- వేల్పూర్‌లో 120 టన్నులు స్వాధీనం

వేల్పూర్: వేల్పూర్ మండల కేంద్రంలోని వజ్ర రైస్ మిల్లులో సుమారు 120 టన్నుల రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. వేల్పూర్ ఎస్సై వినయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీపీ విష్ణుమూర్తి, వేల్పూర్ పోలీసులు దాడిచేసి రైస్‌మిల్లులో అక్రమంగా దాచిన రేషన్ బియ్యాన్ని శనివారం అర్ధరాత్రి పట్టుకున్నారు. రైస్‌మిల్లుపై దాడి చేసే సమయానికి బియ్యం లోడుతో ఉన్న రెండు పెద్ద లారీలు అక్కడ ఉన్నాయి. వీటితో పాటు మరో రెండు లారీల వరకు నిల్వ ఉంచిన రేషన్ బియ్యం ఉన్నాయి. ఆదివారం ఉదయం సివిల్‌సప్లయ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీ శ్రీధర్‌రెడ్డి వజ్ర రైస్‌మిల్లుకు వచ్చి రేషన్ బియ్యాన్ని పరిశీలించి అంచనా వేశారు. పట్టుకున్న బియ్యం సుమారు 120 టన్నులు ఉంటుందని పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని మాక్లూర్‌లోని సాయికృష్ణ రైస్‌మిల్లుకు తరలించి అక్కడ తూకం వేయించి మొత్తం ఎన్ని టన్నులు వస్తుందో నిర్ధారిస్తామన్నారు. రైస్ మిల్లు యజమాని సాయికృష్ణగౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఓఎస్డీ వెల్లడించారు.డిప్యూటీ తహసీల్దార్లు వినోద్, శ్రీనివాస్, వీడీఆర్‌ఐ మహేశ్ ఉన్నారు.



వజ్ర రైస్‌మిల్‌లో పట్టుబడ్డ బియ్యం

**పనిచేయని రైస్‌మిల్లులో అక్రమదందా**

వేల్పూర్‌లోని వజ్ర రైస్‌మిల్లు చాలా ఏళ్లుగా పనిచేయడం లేదు. దీంతో రైస్‌మిల్లు, బియ్యం నిల్వ కోసం నిర్మించిన పెద్ద షెడ్లు ఖాళీగా ఉన్నాయి. అందులో వీఆర్ అగర్‌బత్తి పేరుతో అగర్‌బత్తీలు తయారు చేస్తూ ఓపెన్ ఉంచారు. బియ్యం లారీలు నేరుగా షెడ్లలోకి వెళ్లేంత విశాలంగా ఉన్నాయి. దీంతో రాత్రి సమయంలో దూరప్రాంతాల నుంచి రేషన్ బియ్యం తీసుకువచ్చే లారీలు ఎవరి కంటపడకుండా షెడ్లలోకి వెళ్తాయి. రైస్‌మిల్లు కోసం ఉన్న యంత్రాల ద్వారా రీసైక్లింగ్ చేసి, తిరిగి ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది.

# తూము మరమ్మతులకు చర్యలు



బీర్కూర్‌లో నల్లచెరువును సందర్శించిన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

బాన్సువాడ : బీర్కూర్ మండల కేంద్రంలో ఉన్న నల్ల చెరువును ఆదివారం ఇరిగేషన్, రెవిన్యూ అధికారులు సందర్శించారు. ఈ నెల 10న 'సాక్షి'లో 'ఎండుతున్న పంటలు' శీర్షికతో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. నల్ల చెరువు తూమును పరిశీలించారు. తూములో పెద్ద రాయి ఇరుక్కుపోవడంతో నీళ్లు బయటకు రావడం లేదని, తూము వద్ద పూడిక నిండిపోయిందని రైతులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. రెండు రోజుల్లో చెరువు తూము నుంచి నీళ్లు బయటకొచ్చేలా చర్యలు తీసుకోవాలని, లేకపోతే వందల ఎకరాలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని రైతులు అన్నారు. జాలర్లను పిలిపించి తూము వద్ద ఇరుకుపోయిన రాయిని తీయిస్తామని, పూడికను తొలగిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. చెరువులో నీళ్లు లేకుండా నిజాంసాగర్ డిస్ట్రిబ్యూటర్ కాలువ ద్వారా నీటిని చెరువులోకి వదిలామని, రైతులు సహకరించాలని ఇరిగేషన్ ఏఈ గజానంద్, ఆర్‌ఐ సురేందర్‌రెడ్డి అన్నారు. అధికారుల వెంట ఎంపీపీ రఘు, ఎంపీటీసీ సందీప్, అరిగే గంగులు, సాయిలు, గంగారం తదితరులు ఉన్నారు.

### విజయ సంకల్పయాత్రను సక్సెస్ చేయాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : ఈనెల 12వతేదీన హైదరాబాద్‌లో హోంశాఖ మంత్రి అమిత్‌షా ఆధ్వర్యంలో జరుగు విజయ సంకల్పయాత్రను సక్సెస్ చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రిరాంరెడ్డి అన్నారు. తాడ్వాయి మండలంలోని కన్‌కల్‌లో ఆదివారం జరిగిన మెహెర్‌బాబా వార్షిక ఉత్సవ కార్యక్రమానికి హాజరైన అనంతరం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు.జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బీజేపీ తరపున బీబీపాటిల్‌ను మొదటి విడతలో ప్రకటించడం హర్షనీయ మన్నా రు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రిబాపురెడ్డి మాట్లాడుతూ సికింద్రాబాద్‌లోని ఇంపీరియల్ గార్డెన్‌లో 12వ తేదీన జరుగే సోషల్‌మీడియా ప్రతినిధుల సభను కూడా విజయవంతం చేయాలన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాపురెడ్డి, మండల అధ్యక్షుడు వెంకట్‌రావు, నాయకులు సంతోష్‌రెడ్డి, లింగారావు, రవిందర్‌రావు, శ్రీనివాస్, రాజిరెడ్డి, యాదగిరి తదితరులు ఉన్నారు.

### రాజయోగి ఆశ్రమం స్వామీజీ శివైక్యం



భిక్కనూరు : మండల కేంద్రంలోని వరకవి సిద్ధప్ప రాజయోగి ఆశ్రమం నిర్వాహకుడు అనంతవరం వీరేశలింగం గురుమూర్తి (74) ఆదివారం శివైక్యం చెందారు. ఆయన అంత్యక్రియలను సోమవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు కుటుంబీకులు, శిష్యులు తెలిపారు. భక్తుల సందర్శనార్థం సోమవారం మధ్యాహ్నం వరకు గాంధీచౌక్ వద్ద ఆశ్రమంలో పార్థీవదేహాన్ని ఉంచారు. ఎన్నో మంచి సూక్తులు బోధించేవారిని భక్తులు పేర్కొన్నారు. నిత్యం భక్తులు ఆయనను సందర్శించుకునేవారన్నారు.

### సైకిలిస్ట్‌కు ఘన స్వాగతం

భిక్కనూరు : తమిళనాడుకు చెందిన కరుణ అనే వ్యక్తి అయోధ్యకు సైకిల్‌పై వెళ్తుండగా భిక్కనూరు వద్ద శ్రీరామదండు ప్రతినిధులు ఆదివారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీరామదండు ప్రతినిధి గొల్ల రమేశ్ ఆహార పదార్థాలను, నీటి బాటిళ్లను, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందజేశారు. పూలమాలతో శాలువతో కరుణను సత్కరించారు.



సైకిల్‌పై అయోధ్య వెళ్తున్న తమిళనాడు భక్తుడికి ఆహారపదార్థాలు అందిస్తున్న రామదండు ప్రతినిధులు

# అపూర్వ సమ్మేళనం





బస్వాపూర్‌లో పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

భిక్కనూరు/సదాశివనగర్: పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు తీపి జ్ఞాపకాలకు వేదికలయ్యాయి. భిక్కనూర్ మండలం బస్వాపూర్, సదాశివనగర్ మండలం ఉత్తునూర్ ఉన్నత పాఠశాలల్లో విద్యనభ్యసించిన వారు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు నిర్వహించారు. బస్వాపూర్‌లో 2000–01 బ్యాచ్, ఉత్తునూర్‌లో 2006–07 బ్యాచ్ విద్యార్థులు తమ విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని ఉల్లాసంగా గడిపారు.



సదాశివనగర్ మండలం ఉత్తునూర్‌లో..

## క్రైం కార్నర్

### మానసిక వేదనతో రైతు ఆత్మహత్య

- మూడు బోర్లు తవ్వించినా దక్కని ఫలితం
- పేరుకుపోయిన అప్పులు
- పొలంలోని చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణం

భిక్కనూరు: వ్యవసాయభూమిలో మూడు బోర్లు తవ్వించినా నీళ్లు పడకపోవడం, బోర్లు తవ్వించేందుకు చేసిన అప్పులు పెరిగిపోవడంతో మానసిక వేదనకు గురైన రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఈర నర్సింలు(43) మూడు నెలలక్రితం తన పొలంలో మూడు బోర్లను తవ్వించాడు. నీళ్లు పడకపోగా, వాటికోసం చేసిన అప్పులు పేరుకుపోయి తీవ్ర మానసిక వేదనకు గురయ్యాడు. శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన నర్సింలు తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. తన వ్యవసాయ భూమిలోని చెట్టుకు నర్సింలు ఉరేసుకున్నట్లు ఆదివారం ఉదయం గుర్తించిన పలువురు అతడి కుటుంబ సభ్యులతోపాటు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### కేబుల్ దొంగలకు దేహశుద్ధి

భిక్కనూరు: మండలంలోని అంతంపల్లి గ్రామ శివారులోని వ్యవసాయ బోరుబావులవద్ద నుంచి విద్యుత్ కేబుళ్లను దొంగిలిస్తున్న ఇద్దరిని రైతులు ఆదివారం పట్టుకుని దేహశుద్ధి చేశారు. మండల కేంద్రానికి చెందిన ఇద్దరు యువకులు కేబుళ్లను దొంగిలించి అమ్ముకుంటున్నట్లు అనుమానించిన రైతులు వారి ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని చితకబాదారు. అనంతరం నిందితుల ఇళ్లలో వెతుకగా మరిన్ని విద్యుత్ కేబుళ్లు లభించడంతో వారిని పోలీసులకు అప్పగించారు.

### ఇసుక తరలిస్తున్న వాహనం పట్టివేత



రుద్రూర్: కోటగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని పొతంగల్ మండలం హెగ్డోలి గ్రామ శివారు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం తెల్లవారు జామున హెగ్డోలి శివారుకు వెళ్లగా ఇసుక తరలిస్తున్న వాహనం పట్టుబడిందన్నారు. రెవెన్యూ శాఖ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### రోడ్డు దాటుతున్న మహిళలను ఢీకొట్టిన బైక్

- ఇద్దరికి తీవ్రగాయాలు

ఎడపల్లి (బోధన్): రోడ్డు దాటుతున్న ఇద్దరు మహిళలను బైక్ కొట్టడంతో వారికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. బోధన్ పట్టణానికి చెందిన నాగమణి, అబ్బవ్వ ఎడపల్లిలోని బంధువుల ఇంటికి వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో మండల కేంద్రంలోని రిక్వెస్ట్ స్టాప్ వద్ద రోడ్డు దాటుతుండగా.. బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో నాగమణికి తీవ్ర గాయాలు కాగా, అబ్బవ్వ పరిస్థితి విషమంగా ఉండటంతో నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

# ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్ చోరీ

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం గ్రామ శివారులో వ్యవసాయ విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన మూడు ట్రాన్స్‌ఫార్మర్లను శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి ఆయిల్, కాపర్ కాయిల్స్ ఎత్తుకెళ్లారు. రైతులు ఆదివారం ఉదయం ట్రాన్స్‌కో అధికారులతోపాటు పోలీసులకు సమాచారం అందించారు. ట్రాన్స్‌కో ఏఈ అనిల్, సీఐ కృష్ణ ఘటనా స్థలాన్ని పరిశీలించి సుమారు రూ.3లక్షల సొత్తు చోరీ జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. బోర్లం, బాన్సువాడ రోడ్లలో ఉన్న సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని సీఐ అన్నారు. పంటలు ఎండిపోకుండా త్వరగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు బిగించాలని ప్రజాప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, నర్సింహులు, విఠల్‌రెడ్డి, అహ్మద్ తదితరులు ట్రాన్స్‌కో అధికారులను కోరారు.



ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలిస్తున్న సీఐ కృష్ణ

# రెండు కార్లు ఢీ

- ఇద్దరికి గాయాలు

ఎడపలి(బోధన్): మండల కేంద్రంలో రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇరువురికి గాయాలైనట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. బోధన్ పట్టణంలోని పాన్‌గల్లీకి చెందిన అబ్దుల్ సలాం తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో హైదరాబాద్‌కు వెళ్లి ఆదివారం ఉదయం తిరిగి వస్తున్నాడు. 7.30 సమయంలో ఎంఎస్‌సీఫారం వద్ద రోడ్డు దాటగానే బోధన్ వైపు నుంచి వస్తున్న కారు డివైడర్‌ను ఢీ కొట్టి ఎగిరి అబ్దుల్ సలాం కారు బానెట్‌పై పడింది. ఈ ఘటనలో సలాంకు స్వల్ప గాయాలుకాగా, అతడి అన్నయ్య నుదుటిపై, కుడిచేతికి గాయాలయ్యాయి. సలాం పిర్యాధు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ఘటనాస్థలంలో ధ్వంసమైన కార్లు

### మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి

ఎడపల్లి(బోధన్): పెళ్లయి విడాకులు కావడంతో మండల కేంద్రానికి చెందిన కంటెడి రాహుల్(25)మనస్తాపానికి గురై చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై విక్రమ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. డ్రైవర్‌గా పనిచేసే రాహుల్ ఈనెల 8వ తేదీన ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆదివారం ఎడపల్లి గ్రామ పులి చెరువులో అతడి మృతదేహం లభించింది. మృతుడి తల్లి కంటెడి శశిరేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**రైలు కింద పడి గుర్తు తెలియని వృద్ధుడు..**



కామారెడ్డి క్రైం: రైలు కింద పడి ఓ గుర్తు తెలియని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కామారెడ్డి – ఉప్పల్‌వాయి రైల్వే స్టేషన్ల మధ్య రైలు పట్టాలపై శనివారం రాత్రి చోటు చేసుకుంది. శనివారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో రైలు పట్టాలపై ఓ మృతదేహం ఉన్నట్లు గుర్తించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని రైల్వే ఎస్సై తావునాయక్ పరిశీలించి విచారణ చేపట్టారు. మృతుడి వయస్సు 70 నుంచి 75 సంవత్సరాల ఉంటుందని, మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే సమాచారం ఇవ్వాలని కోరారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### ఒకరి అదృశ్యం



గంగారాం (ఫైల్)

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన మంగ్లారం గంగారాం (63) అదృశ్యమైనట్లు ఎస్సై రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిన గంగారాం తిరిగి రాలేదని, కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

# భర్త ఇంటి ఎదుట భార్య ధర్నా

- మరో పెళ్లి చేసుకుంటున్నాడని ఆవేదన
- ఇరు కుటుంబాలకు పోలీసుల కౌన్సిలింగ్

కామారెడ్డి క్రైం: అదనపు కట్నం కోసం వేధించడంతోపాటు తనకు తెలియకుండా మరో పెళ్లి చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాడని ఓ మహిళ తన భర్త ఇంటి ఎదుట బైఠాయించింది. వివరాలు ఇలా ఉన్నాయి.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసే కామారెడ్డి పట్టణంలోని భవానీనగర్ కాలనీకి చెందిన వడ్ల కార్తీక్‌కు సిరిసిల్లకు చెందిన శివానితో 2019లో వివాహమైంది. పెళ్లిసమయంలో శివానీ కుటుంబ సభ్యులు కార్తీక్‌కు రూ.5లక్షల నగదుతోపాటు 15తులాల బంగారాన్ని కట్నంగా ఇచ్చారు. కొద్ది రోజులకే భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు రాగా, గర్భిణీగా ఉన్న శివానీని కార్తీక్ ఆమె తల్లిగారింటి వద్ద వదిలేసి వెళ్లిపోయాడు. పాప పుట్టిన తరువాత పెద్ద మనుషుల సమక్షంలో రాజీకుదిర్చగా హైదరాబాద్‌లో కాపురం పెట్టారు. మరో 6 నెలల గడిచిన తరువాత రూ.10 లక్షలు అదనపు కట్నం తేవాలని శివానీని వేధించడం మొదలు పెట్టిన కార్తీక్.. శివానీని మళ్లీ తల్లి గారి ఇంటి వద్ద వదిలేసి వెళ్లిపోయాడు. వారి మధ్య గొడవలు పోలీస్‌స్టేషన్లు, కోర్టుల వరకు వెళ్లాయి. ఈ క్రమంలో కార్తీక్ మరో పెళ్లికి ప్రయత్నాలు చేస్తున్నాడని తెలుసుకున్న శివాని.. తన మూడేళ్ల కుమార్తె, తల్లిదండ్రులు, సోదరునితో కలిసి ఆదివారం కామారెడ్డికి వచ్చింది. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ భర్త ఇంటి ఎదుట బైఠాయించింది. తమకు కార్తీక్ వచ్చి తీవ్రంగా కొట్టి వెళ్లిపోయాడని శివానీ కుటుంబ సభ్యులు ఆరోపించారు. పట్టణ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని ఇరు కుటుంబాల సభ్యులను పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు.



కుటుంబ సభ్యులతో కలిసి భర్త ఇంటి ఎదుట బైఠాయించిన శివాని